సాక్షి కర్నూలు
బుధవారం : 15 : మే : 2024



శనగల బసవన్నకు పూజలు

శ్రీశైలం: ఆలయ ప్రాంగణంలోని శనగల బసవన్నకు మంగళవారం పూజలు నిర్వహించారు. దేవస్థానం ఈఓ పెద్దిరాజు, అర్చకులు బసవన్నకు జలాభిషేకం చేసి శనగలను నైవేద్యంగా సమర్పించారు.



మహానందిలో భక్తుల సందడి

మహానంది: మహానంది ఆలయం మంగళవారం భక్తజనంతో కిటకిటలాడింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు కోనేరులో పుణ్య స్నానాలు చేసి మహానందీశ్వరుడిని దర్శించుకున్నారు.



వీరభద్రుడికి విశేషార్చనలు

శ్రీశైలం: బయలు వీరభద్రస్వామికి మంగళవారం శ్రీశైల దేవస్థానం విశేష పూజలు నిర్వహించింది. ప్రతి మంగళ, శుక్రవారాలతో పాటు విశేష పర్వదినాల్లో పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోంది.

న్యూస్‌రీల్

ఓర్వకల్లులో 56 మి.మీ వర్షపాతం

కర్నూలు(అగ్రికల్చర్): ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గిపోయాయి. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈ సారి ఉష్ణోగ్రతలు 47.7 డిగ్రీలకు చేరాయి. ఆ తర్వాత వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా ఎండల తీవ్రత తగ్గుముఖం పట్టింది. ఇటు కర్నూలు, అటు నంద్యాల జిల్లాలో ఆశాజనకంగా వర్షాలు కురుస్తున్నాయి. భారీ వర్షాల వల్ల ఉమ్మడి జిల్లాలో పలు చెరువులకు భారీగా నీరు వచ్చింది. హంద్రీ కూడా ప్రవహించింది. ఈ కారణంగా ఉష్ణోగ్రతలు పడిపోయాయి. సోమవారం రాత్రి ఓర్వకల్లులో 56 మి.మీ వర్షపాతం నమోదైంది. మంగళవారం కూడా అక్కడక్కడ తేలిక పాటి వర్షాలు కురిశాయి. కర్నూలు జిల్లా కౌతాళంలో అత్యధికంగా 39.4 డిగ్రీలు, అత్యల్పంగా తుగ్గలిలో 35.5 డిగ్రీలు, నంద్యాల జిల్లా ఆత్మకూరులో అత్యధికంగా 39.9, అత్యల్పంగా బేతంచెర్లలో 37 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న రోజుల్లో వివిధ ప్రాంతాల్లో వర్షాలు పడే అవకాశం ఉంది. ఇందువల్ల ఉష్ణోగ్రతలు మరింత పడిపోయే అవకాశం ఉంది.

మధ్యవర్తిత్వం ద్వారా కేసుల పరిష్కారం

కర్నూలు (లీగల్) : మధ్యవర్తిత్వ చట్టం ద్వారా కేసులకు 90 రోజుల్లో పరిష్కరించనున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి పేర్కొన్నారు. మంగళవారం మధ్యవర్తిత్వ చట్టంపై న్యాయ సేవ సదన్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మాట్లాడుతూ మధ్యవర్తులుగా అర్హ త పొందిన న్యాయవాదులకు 40 గంటల పా టు మధ్యవర్తిత్వ చట్టంపై శిక్షణ ఇస్తామన్నారు. అనంతరం మధ్యవర్తిత్వులుగా నియ మిస్తామన్నారు. శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షులు ఎం.వెంకట హరినాథ్, బార్ ప్రెసిడెంట్ బి.కృష్ణమూర్తి, జనరల్ సెక్రటరీ రవికాంత్ ప్రసాద్, న్యాయవాదులు పాల్గొన్నారు.

పలు రైళ్లు రద్దు

నంద్యాల (సిటీ): రైల్వే లైన్ డబ్లింగ్ పనులు, సాంకేతిక కారణాలతో రైల్వే అధికారులు గుంటూరు డివిజన్ పరిధిలోని పలు రైళ్లను రద్దు చేశారు. గుంటూరు నుంచి పలు ప్రాంతాలకు వెళ్లాల్సిన పలు రైళ్లను ఈ నెల 16 నుంచి జూన్ 1వ తేదీ వరకు తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు చీఫ్ ప్యాసింజర్ ట్రాఫికింగ్ మేనేజర్ ఏ.సురేష్ రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. గుంటూరు, గుంతకల్లు మధ్య నడి చే రైళ్లలో గుంటూరు - కాచిగూడ, కాచిగూడ - గుంటూరు (17251/17252), హుబ్లీ-విజయవాడ, విజయవాడ - హుబ్లీ 17329/17330 నంబర్ రైళ్ల తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు వివరించారు.

నేటి నుంచి ఎమ్మిగనూరు విద్యుత్ లైన్ సామర్థ్యం పెంపు పనులు

కర్నూలు(అగ్రికల్చర్): పెరుగుతున్న విద్యుత్ లోడు, భవిష్యత్ అవసరాల దృష్ట్యా కర్నూలు కార్బైడ్‌లో 220 కేవీ సబ్ స్టేషన్ నుంచి ఎమ్మిగనూరు లైన్ సామర్థ్యాన్ని పెంచనున్నారు. ఇందుకు సంబంధించిన పనులు నేటి నుంచి ప్రారంభం కానున్నట్లు విద్యుత్ శాఖ ఎస్ఈ ఉమాపతి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 132 కేవీ గూడూరు, 132 కేవీ ఎమ్మిగనూరు, 132 కేవీ మాధవరం లైన్‌లను పాత ఏసీఎస్ఆర్ కండక్టర్ స్థానంలో అధిక సామర్థ్యం ఉన్న ఏసీఎస్ఎస్ కండక్టరును మార్పు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ నెల 15 నుంచి వచ్చే నెల 2 వరకు పనులు జరుగుతాయని పేర్కొన్నారు. పనులు జరిగే సమయంలో ఎప్పుడైనా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగితే రైతులు, వినియోగదారులు సహకరించాలని కోరారు. ఎమ్మిగనూరు విద్యుత్ లైన్ సామర్థ్యం పెంపుతో రానున్న రోజుల్లో వ్యవసాయానికి మరింత నాణ్యమైన విద్యుత్ ఇచ్చేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

భారీగా నగదు పట్టివేత



కర్నూలు : స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో తనిఖీల్లో ఆధారాలు లేని నగదు పట్టుబడింది. కర్నూలు శివారులోని పంచలింగాల అంతర్ రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు వద్ద సెబ్ ఎస్ఐ పృథ్వీరాజ్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం వాహన తనిఖీలు నిర్వహించారు. హైదరాబాద్ వైపు నుంచి కర్నూలుకు వస్తున్న ఓ కారును ఆపి తనిఖీ చేయగా భారీగా నగదు బయటపడింది. అందులో ఉన్న డ్రైవర్‌తో పాటు యజమాని వనపర్తికి చెందిన వెంకటేష్‌ను విచారించగా కర్నూలులోని షరాఫ్‌బజార్‌లో ఉన్న ఓ దుకాణంలో బంగారు కొనుగోలుకు వెళ్తున్నట్లు తెలిపారు. అయితే, డబ్బుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో ఏఈఎస్ వినోద్‌కుమార్ చెక్‌పోస్టు వద్దకు చేరుకుని కౌంటింగ్ మిషన్ తెప్పించి డబ్బులు లెక్కపెట్టారు. దాదాపు రూ.35,70,000 ఉండటంతో జీరో వ్యాపారిగా అధికారులు అనుమానిస్తున్నారు.

ఖరీఫ్‌కు ‘చల్లని’ కబురు!

ఈ సారి ముందస్తుగా నైరుతి రుతుపవనాలు

- మే నెలలో ఇప్పటికే 42 శాతం అధిక వర్షపాతం
- ముమ్మరంగా వ్యవసాయ పనులు
- అధిక వర్షాలు కురవచ్చని వాతావరణ శాఖ ప్రకటన
- ఖరీఫ్ సీజన్‌కు 15,218 క్వింటాళ్ల విత్తనం కేటాయింపు
- వేరుశనగలో కొత్తగా టీసీజీఎస్ 1694 కొత్త రకం
- సిద్ధంగా 1,90,400 టన్నుల ఎరువులు

కోడుమూరు సమీపంలో పొలంలో నిలిచిన వర్షపు నీరు



కర్నూలు(అగ్రికల్చర్): 2023-24లో ఎల్‌నినో ప్రభావంతో అనావృష్టి పరిస్థితులు ఏర్పడినా 2024-25లో వర్షాలు విస్తారంగా కురుస్తాయని ఇప్పటికే భారత వాతవరణ సంస్థ ప్రకటించడం రైతులకు ఆనందాన్ని కలిగిస్తోంది. మొన్నటి వరకు కొనసాగిన భానుడి భగభగలు వాతావరణంలో చోటు చేసుకున్న మార్పుల వల్ల తగ్గుముఖం పట్టాయి. ఇప్పటికే జిల్లాలో తేలికపాటి నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ ఏడాది వ్యవసాయం కలసి వస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. నైరుతి రుతుపవనాలు కాస్త ముందుగానే విస్తరించే అవకాశం ఉండటం విశేషం. మే నెల సాధారణ వర్షపాతం 40.1 మి.మీ., ఉండగా ఈ నెల 14 నాటికి 56.9 మి.మీ వర్షపాతం నమోదైంది. ఇప్పటికే 42 శాతం అధిక వర్షం కురిసింది. జిల్లాలో 466 రైతుభరోసా కేంద్రాలు ఉండగా అన్నింటిలో యాంత్రీకరణ అందుబాటులోకి రావడంతో రైతులు యంత్రాలు, యంత్ర పరికరాలతో ఖరీఫ్ సీజన్‌కు భూములను సిద్ధం చేసుకుంటున్నారు. ప్రభుత్వం కూడా ఇప్పటికే ఎరువులు, విత్తనాలు కేటాయించింది. ఈ ఏడాది భూసార పరీక్షలు పెద్ద ఎత్తున చేపట్టనున్నారు. జూన్ నెలలో 10వేల భూసార పరీక్షలు నిర్వహించేందుకు వ్యవసాయ శాఖ చర్యలు చేపట్టింది. మట్టి నమూనాలు సేకరణకు ఇప్పటికే ఉత్తర్వులు జారీ అయ్యాయి.

మండలాల వారీగా విత్తనాల కేటాయింపు

జిల్లాలో సాగు చేసే పంటల్లో అత్యంత ప్రధానమైంది పత్తి. ఆ తర్వాత వర్షాధారం కింద సాగు చేసే ప్రధాన పంట వేరుశనగ. ఇప్పటికే సబ్సిడీపై విత్తనాల పంపిణీకి ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. ప్రతి ఏటా కే-6 రకం వేరుశనగ మాత్రమే పంపిణీ చేస్తున్నారు. ఈ సారి టీసీజీఎస్ 1694 కొత్త రకాన్ని కూడా సబ్సిడీపై పంపిణీ చేయడానికి వ్యవసాయ శాఖ ఏర్పాట్లు చేస్తోంది. జిల్లాకు వేరుశనగ 13,929 క్వింటాళ్లు కేటాయించింది. ఇందులో కే-6 రకం 12,729 క్వింటాళ్లు, టీసీజీఎస్ 1694 రకం 1200 క్వింటాళ్లు కేటాయించింది. ఖరీఫ్ సీజన్ అదనంగా కే6 రకం 3000, టీసీజీఎస్ 1694 రకం 2000 క్వింటాళ్లు కేటాయించాలని వ్యవసాయ శాఖ వ్యవసాయ శాఖ ప్రతిపాదనలు పంపింది. కందులు 1000 క్వింటాళ్లు, మినుములు 20 క్వింటాళ్లు, పెసలు 2 క్వింటాళ్లు, కొర్రలు 45 క్వింటాళ్లు, దయంచ 197, పిల్లి పెసర 25 క్వింటాళ్ల ప్రకారం మొత్తం 15,218 క్వింటాళ్లు కేటాయించింది. ప్రస్తుతం సబ్సిడీపై పంపిణీ చేసే విత్తనాల ప్రాసెసింగ్ ప్రక్రియ కూడా చురుగ్గా సాగుతోంది. జిల్లా వ్యవసాయ శాఖ మాత్రం 46,660 క్వింటాళ్లు అవసరమని పేర్కొంది.

15 శాతం సాగు పెరిగే అవకాశం

2023-24లో 3,82,399 హెక్టార్లలో పంటలు సాగయ్యాయి. ఇందులో వర్షాధారం కింద 2,93,832 హెక్టార్లు, నీటి ఆధారం కింద 88,567 హెక్టార్లు సాగయ్యాయి. 2024-25 ఖరీఫ్‌లో 10 నుంచి 15 శాతం వరకు సాగు పెరిగే అవకాశం ఉంది. ఈ ఏడాది ఖరీఫ్‌లో 4లక్షలకు పైగా హెక్టార్లలో పంటలు సాగయ్యే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ప్రధానంగా పత్తి, వేరుశనగ, వరి, మిర్చి, మొక్కజొన్న, ఉల్లి, కంది తదితర పంటలు సాగయ్యే అవకాశం ఉంది. జిల్లాలో నల్లరేగడి నేలలు ఎక్కువగా ఉండటం వల్ల ఈ ఏడాది కూడా పత్తి ఎక్కువగా సాగయ్యే అవకాశం కనిపిస్తోంది. గత ఏడాది 1,90,537 హెక్టార్లలో పత్తి సాగయింది. ఈ సారి 2లక్షలకుపైగా హెక్టార్లలో పత్తి సాగయ్యే అవకాశం ఉన్నట్లు అంచనా.



ఖరీఫ్ సీజన్‌కు భూమిని సిద్ధం చేసుకుంటున్న రైతు

విత్తనం మంచిదైతేనే పంట బాగు

రైతులకు మంచి విత్తనం అందించాలనేదే వ్యవసాయ శాఖ ప్రధాన ఉద్దేశం. ఇందుకోసమే వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం నియోజక వర్గాల వారీగా ల్యాబ్‌లు ఏర్పాటు చేసింది. ఎరువు నాణ్యతతో ఉంటే పంటలు కూడా ఏపుగా పెరిగి పచ్చదనంతో కళకళలాడుతాయి. పంటలపై పిచికారీ చేసే పురుగుమందు కూడా నాణ్యతతో ఉంటే చీడపీడలు సకాలంలో అదుపు చేసుకోవచ్చు. ఇందులో ఏది నాణ్యతతో లేకపోయినా దాని పరిణామాలు తీవ్రంగా ఉంటాయి. నకిలీలు, కల్తీలకు తావు లేకుండా ప్రభుత్వం నియోజకవర్గం వారీగా వైఎస్ఆర్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లు ఏర్పాటు చేసింది. రైతులు తాము కొనుగోలు చేసిన విత్తనాలు, ఎరువుల నాణ్యతా ప్రమాణాలను ముందుజాగ్రత్తగా ల్యాబ్‌ల్లో చెక్ చేసుకునే వీలుంది. ఈ పరీక్షలు ఉచితంగానే నిర్వహిస్తారు.

జిల్లాకు 1,90,400 టన్నుల ఎరువులు

ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి జిల్లాకు 1,90,400 టన్నుల ఎరువులు కేటాయిస్తూ ఇప్పటికే వ్యవసాయ శాఖ సప్లయి ప్లాన్ ఇచ్చింది. 2023-24లో ఎరువుల వినియోగం తగ్గింది. ఇందుకు వర్షాభావ పరిస్థితులు ఒక కారణం. 2023-24 ఖరీఫ్, రబీ సీజన్‌లలో 2,07,815 టన్నుల ఎరువులు మాత్రమే వినియోగించారు. 2024-25 సంవత్సరం ఖరీఫ్ సీజన్‌కు మాత్రమే 1,90,400 టన్నులు కేటాయించడం విశేషం. యూరియా 54,432 టన్నులు, డీఏపీ 16,223 టన్నులు. ఎంవోపి 1,485, కాంప్లెక్స్ ఎరువులు 1,16,571, ఎస్ఎస్‌పీ 1689 టన్నుల ప్రకారం కేటాయిస్తూ సెప్టెంబరు నెల వరకు సప్లయ్ ప్లాన్ ఇచ్చింది. కాగా జిల్లాలో ప్రకృతి వ్యవసాయం పెరుగుతున్నందున రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించే దిశగా వ్యవసాయ శాఖ చర్యలు చేపట్టింది. కనీసం 3 శాతం రసాయన ఎరువుల వాడకం తగ్గించే దిశగా చర్యలు చేపట్టం విశేషం.

ఖరీఫ్‌కు సిద్ధమవుతున్నాం



ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే వర్షాలు ఆశాజనకంగా పడుతుండటంతో వ్యవసాయ పనులు ముమ్మరమయ్యాయి. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించే ఏర్పాటు చేశాము. సాగు విస్తీర్ణాన్ని బట్టి ఇప్పటికే మండలాల వారీగా విత్తనాలు కేటాయించాం.

– పీఎల్ వరలక్ష్మి, డీఏఓ, కర్నూలు

స్ట్రాంగ్ రూముల్లో భవితవ్యం



ఈవీఎం గది వద్ద కేంద్ర బలగాల బందోబస్తు



రాయలసీమ యూనివర్సిటీలో ఈవీఎంలు, పోలింగ్ సామగ్రిని భద్రపరుస్తున్న దృశ్యం

- కర్నూలు పార్లమెంట్‌లో 76.80 శాతం ఓటింగ్ నమోదు
- 8 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కలిపి 76.42 శాతం పోలింగ్
- తుది పోలింగ్ నమోదు వివరాలు విడుదల చేసిన ఎన్నికల కమిషన్
- జూన్ 4వ తేదీన ఎన్నికల కౌంటింగ్, ఫలితాల ప్రకటన
- అత్యధికంగా పత్తికొండలో 84.98 శాతం, అత్యల్పంగా కర్నూలులో 63.75 శాతం ఓటింగ్
- స్ట్రాంగ్ రూమ్‌లకు మూడంచెల భద్రత

కర్నూలు(సెంట్రల్): సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ముగిసింది. ఈవీఎంలలో నిక్షిప్తమైన అభ్యర్థుల భవితవ్యాన్ని అధికారులు అత్యంత కట్టుదిట్టమైన భద్రత మధ్య రాయలసీమ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూములకు తరలించి భద్రపరిచారు. ఓటరు తీర్పు ఎటు వైపు ఉన్నదో జూన్ 4న జరిగే ఓట్ల లెక్కింపులో తేలనున్నది. కాగా 2024 పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల తుది పోలింగ్ వివరాలను మంగళవారం ఎన్నికల కమిషన్ విడుదల చేసింది. కొన్ని కేంద్రాల్లో మే 13వ తేదీ అర్ధరాత్రి వరకు పోలింగ్ కొనసాగడంతో ఓటింగ్ వివరాలు పూర్తి స్థాయిలో విడుదల కాలేదు. ఈ క్రమంలో మంగళవారం విడుదలైన వివరాల ప్రకారం కర్నూలు పార్లమెంట్ నియోజకవర్గంలో 76.80 శాతం ఓటింగ్ నమోదైంది. అలాగే జిల్లాలోని కర్నూలు, పాణ్యం, కోడుమూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని, ఆలూరు, పత్తికొండ నియోజకవర్గాల్లో కలిపి మొత్తం 76.42 శాతం మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అయితే 2019 ఎన్నికలతో పోల్చుకుంటే నమోదైన ఓటింగ్ శాతం అసెంబ్లీల్లో స్వల్పంగా పెరగగా..పార్లమెంట్‌లో స్వల్పంగా తగ్గింది.

2019 ఎన్నికలతో పోల్చుకుంటే అసెంబ్లీల్లో 0.6 శాతం అధికం..

అసెంబ్లీ స్థానాలు	2019లో ఓటింగ్ శాతం	2024లో ఓటింగ్ శాతం
కర్నూలు	59.53	63.75
పత్తికొండ	83.97	84.98
కోడుమూరు	79.52	79.14
ఎమ్మిగనూరు	79.16	81.97
మంత్రాలయం	84.98	84.31
ఆదోని	65.31	66.55
ఆలూరు	79.71	80.73
పాణ్యం	74.41	74.44
కర్నూలు పార్లమెంట్	78.28	76.80

కర్నూలు జిల్లాలో మొత్తం 20,54,563 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 10,13,794 మంది, స్త్రీలు 10,40,451, ఇతరులు 318 మంది ఉన్నారు. అయితే మొత్తం ఓటర్లలో 15,70,007 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో పురుషులు 7,88,074 మంది, మహిళలు 7,81,793 మంది, ఇతరులు 135 మంది ఉన్నారు. అయితే మహిళల కంటే 6,286 మంది పురుష ఓటర్లే అధికంగా ఓటు వేశారు. మొత్తంగా అన్ని నియోజక వర్గాల్లో కలిపి 76.42 శాతం ఓటింగ్ నమోదైంది. కాగా, ఈ పోలింగ్ శాతం 2019 ఎన్నికలతో పోల్చుకుంటే 0.6 శాతం అధికంగా నమోదైంది. అలాగే కర్నూలు పార్లమెంట్‌కు సంబంధించి 2019లో 78.28 శాతం ఓటింగ్ నమోదైంది. ఈ ఎన్నికల్లో పార్లమెంట్ పరిధిలో 76.80 శాతం మంది ఓటు వేశారు. 2019 ఎన్నికలతో పోల్చుకుంటే ప్రస్తుత ఎన్నికల్లో 1.48 శాతం పోలింగ్ తగ్గింది.

ఆర్‌యూకు తరలింపు

ఎన్నికలు ముగియగానే ఈవీఎంలను పోలింగ్ కేంద్రాల నుంచి అత్యంత భద్రత నడుమ జీపీఎస్‌తో అనుసంధానమైన వాహనాల్లో రాయలసీమ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన రిసెప్షన్ సెంటర్లకు తరలించారు. ఈ క్రమంలో వాటిని మూడంచెల భద్రత, సీసీ కెమెరాల నిఘా ఉన్న స్ట్రాంగ్ రూమ్‌ల్లో మంగళవారం ఉదయం కలెక్టర్ జనరల్ అబ్జర్వర్ జాఫర్ వి. డాక్టర్ జి.సృజన, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో భద్రపరచారు. ఏజెంట్లతో సంతకాలు తీసుకున్న తరువాత సీల్ వేసి తాళాలు వేశారు. కర్నూలు, ఆదోని అసెంబ్లీలు, పార్లమెంట్‌కు సంబంధించిన ఈవీఎంలను లైఫ్ సైన్సెస్ బ్లాక్‌లో, కోడుమూరు, ఎమ్మిగనూరునకు సంబంధించిన ఈవీఎంలను ఇంజినీరింగ్ బ్లాక్‌లో, మంత్రాలయం, పాణ్యం, ఆలూరు అసెంబ్లీలకు సంబంధించి లైబ్రేరి బ్లాక్‌లో, పత్తికొండ అసెంబ్లీకి సంబంధించిన ఈవీఎంలను లైబ్రేరి బ్లాక్-3 భద్రపరచారు. ఈవీఎంలను భద్రపరచే కార్యక్రమంలో ఆయా నియోజకవర్గాల ఆర్వోలు, ఏఈఆర్ఓలు పాల్గొన్నారు.

పత్తికొండలో అధికం... కర్నూలులో అత్యల్పంగా పోలింగ్

2019 ఎన్నికలతో పోల్చుకుంటే జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో స్వల్పంగా పోలింగ్ శాతం పెరిగింది. అయితే కోడుమూరు, ఎమ్మిగనూరులలో మాత్రం స్వల్పంగా పోలింగ్ శాతం తగ్గడం గమనార్హం. ఈ ఎన్నికల్లో పత్తికొండ, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆలూరులలో ఏకంగా 80 శాతం పోలింగ్ నమోదైంది. అలాగే అత్యధికంగా పత్తికొండలో 84.98 శాతం మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. అత్యల్పంగా కర్నూలులో 63.75 శాతం ఓటింగ్ నమోదైంది. అయితే, 2019 ఎన్నికల్లో అత్యల్పంగా పోలింగ్ నమోదైన కర్నూలు, ఆదోనిలలో 75 శాతం ఓటింగ్‌ను పెంచాలని అధికారుల చేసిన ప్రయత్నం ఫలించలేదు. గత ఎన్నికల్లో కర్నూలులో 59.53 శాతం ఓటింగ్ నమోదు కాగా, 63.75 శాతానికి పెరిగింది. అలాగే ఆదోనిలో గత ఎన్నికల్లో 65.31 శాతం ఓటింగ్ నమోదు కాగా, ఈ సారి 66.55 శాతం మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఏదిఏమైనా ఈ రెండు నియోజకవర్గాల్లో స్వల్పంగా పోలింగ్ శాతం పెరిగింది.

వైఎస్సార్‌సీపీదే విజయం

- జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి



మాట్లాడుతున్న జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అమలు చేయడంతో ఈ ఎన్నికల్లో పాజిటివ్ ఓటింగ్ భారీగా నమోదై మరో సారి వైఎస్సార్‌సీపీ విజయం సాధించబోతుందని జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం కొలిమిగుండ్లలోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువ శాతం పోలింగ్ జరిగిందన్నారు. మహిళలు, వృద్ధులు, యువత వైఎస్సార్‌సీపీకి మద్దతు పలికారన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల అయినప్పటి నుంచి ప్రచారం ముగిసే వరకు కార్యకర్తలు, నాయకులు సొంత పనులు మానుకొని పార్టీ కోసం పని చేశారని వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి గ్రామంలో ఆయా గ్రామాల పార్టీ శ్రేణులు కష్టపడి ఐదారు సార్లు విస్తృత ప్రచారం నిర్వహించారన్నారు. కొలిమిగుండ్ల మండలంలో 88 శాతం పోలింగ్ నమోదైందన్నారు. బనగానపల్లెలో మరో సారి వైఎస్సార్‌సీపీ జెండా ఎగురబోతుందన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి, జేసీఈఎస్ మండల కన్వీనర్ మొలక రాజారెడ్డి, నాయకులు సత్తిగారి రామిరెడ్డి, పేరం బయపురెడ్డి, కొప్పుల నారాయణరెడ్డి, కృష్టారెడ్డి, నీలం సంజీవకుమార్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నోటీస్ బోర్డు

రేపటి నుంచి బీఈడీ పరీక్షలు

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో ఈనెల 16 నుంచి 21వ తేదీ వరకు బీఈడీ, బీపీఈడీ, ఎంపీఈడీ సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వర్సిటీ కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. వర్సిటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ బి. సుధీర్ ప్రేమ్ కుమార్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా 15 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. బీఈడీ 3వ సెమిస్టర్ పరీక్షలకు రెగ్యులర్ 3012 మంది, సప్లిమెంటరీకి 568, బీపీఈడీ మొదటి సెమిస్టర్ రెగ్యులర్ 104, సప్లిమెంటరీకి 19, 4వ సెమిస్టర్ రెగ్యులర్ 71, సప్లిమెంటరీకి 36, ఎంపీఈడీ మొదటి సెమిస్టర్ రెగ్యులర్ 84, సప్లిమెంటరీకి 16, 4వ సెమిస్టర్ రెగ్యులర్ 122, సప్లిమెంటరీకి 16 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు వెల్లడించారు.

ఎంసెట్ పరీక్ష కేంద్రాల మార్పు

కోవెలకుంట్ల: 2024 సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఎంసెట్ పరీక్ష కేంద్రాల కేటాయింపులో స్వల్ప మార్పులు చోటు చేసుకున్నాయి. ఈ నెల 17వ తేదీ నుంచి ఎంసెట్ ప్రవేశ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. నంద్యాల జిల్లాలోని వివిధ కళాశాలలతోపాటు ఆర్‌జీఎం, శాంతిరాం కళాశాలలను పరీక్ష కేంద్రాలుగా ఎంపిక చేశారు. ఇందుకు సంబంధించి అభ్యర్థులు ఇటీవలే హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకున్నారు. అయితే ఆర్‌జీఎం, శాంతిరాం కళాశాలల్లో ఈవీఎంలను భద్రపరిచారు. ఈ కారణంగా పరీక్ష కేంద్రాల జాబితా నుంచి ఆ రెండు కళాశాలలను తొలగించారు. గతంలో హాల్‌టికెట్లు పొందిన విద్యార్థులకు ఈ కళాశాలలు పరీక్షా కేంద్రాలు ఉన్నట్లు అయితే మరలా కొత్తగా హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని, లేకపోతే ఇబ్బంది పడతారని అధికారులు సూచిస్తున్నారు.

16 నుంచి డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు



కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో ఈనెల 16 నుంచి జూన్ 15వ తేదీ వరకు డిగ్రీ సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వర్సిటీ కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. వర్సిటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ బి. సుధీర్ ప్రేమ్ కుమార్ ఆదేశాల మేరకు పరీక్షల నిర్వహణకు షెడ్యూల్ ప్రకటించామని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 61 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రెండవ సెమిస్టర్ పరీక్షలకు రెగ్యులర్ 7,531 మంది, సప్లిమెంటరీకి 9,167, నాలుగో సెమిస్టర్ రెగ్యులర్ 6,625,సప్లిమెంటరీకి 9,097 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. స్పెషల్ సప్లిమెంటరీ పరీక్షలకు 3,374 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు.

సప్లిమెంటరీకి దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు కల్చరల్: అనంతపురం శ్రీ కృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ స్పెషల్ సప్లిమెంటరీ పరీక్షలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు వర్సిటీ డైరెక్టరేట్ ఆఫ్ ఎవాల్యూయేషన్ అధికారులు తెలిపారు. 1994-95 నుంచి 2014 -15 సంవత్సరం వరకు డిగ్రీ చదివి ఫెయిల్ అయిన వారికి పరీక్షలు రాసేందుకు ఒక్క అవకాశం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఫెయిలైన విద్యార్థులు జూన్ 14వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. మరిన్ని వివరాలకు www.skuniversity.ac.inవెబ్‌సైట్‌ను సందర్శించాలని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం


రమేష్ (ఫైల్)

తుగ్గలి: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన ఘటన మంగళవారం సాయంత్రం రాంపల్లి సమీపంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు..రాంపల్లికి చెందిన బాయిగడ్డ సుంకయ్య కుమారుడు రమేష్ (20) బైక్‌పై పెండేకల్లు రైల్వే జంక్షన్‌కు వెళుతుండగా మార్గమధ్యలో ఎదురుగా వస్తున్న అదే గ్రామానికి చెందిన నాగరాజు బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో రమేష్ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. నాగరాజు కూడా గాయపడడంతో చికిత్స నిమిత్తం డోన్‌కు తరలించారు. మృతుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు తుగ్గలి పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇరు వర్గాలపై కేసు నమోదు

బొమ్మలసత్రం: స్థానిక ఫరూక్‌నగర్‌లోని పోలింగ్ కేంద్రం వద్ద జరిగిన సంఘటనతో ఇరువర్గాలపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఫరూక్‌నగర్‌లోని పోలింగ్ బూత్‌వద్ద టీడీపీ నేతలు ఎమ్మెల్యే అభ్యర్థి ఫరూక్, ఆయన తనయుడు ఫిరోజ్, న్యాయవాది తులసిరెడ్డితో పాటు మరి కొంత మంది, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి శిల్పా రవిచంద్ర కిషోర్‌రెడ్డి, ఆదిరెడ్డి, న్యాయవాది ఫణీంద్రనాథ్‌శర్మతో పాటు మరికొంత మంది మధ్య వాగ్వాదం చోటు చేసుకుని స్వల్ప ఘర్షణకు దారి తీసింది. పోలీసులు ఇరుపక్షాలకు నచ్చజెప్పి పంపారు. ఈ సంఘటనపై ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు.

తల్లి ఒడి...శిశువుకు హాయి

- ఎలాంటి అనారోగ్యాలు దరిచేరవు
- తల్లికి పాలు సమృద్ధిగా పడతాయి
- బిడ్డకు ఎలాంటి ఇన్‌ఫెక్షన్లూ సోకవు
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవగాహన
- నేడు కంగారూ సంరక్షణ అవగాహన దినం

అప్పుడే పుట్టిన పిల్లలకు తొలి నెల చాలా కీలకం. తల్లి కడుపులో భద్రంగా ఉన్న వారు బయట పరిస్థితులకు తట్టుకోలేక చనిపోతుంటారు. దీనికి తక్కువ బరువుతో పుట్టడం, నెలలు నిండకుండా జన్మించడం ఇలా అనేక కారణాలు ఉంటాయి. ఈ ఆరోగ్య సమస్యలను అధిగమించేందుకు అప్పుడే పుట్టిన శిశువుల సంరక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలి. కంగారూ జంతువు ఎలాగైతే తన పిల్లలను తన ప్యాకెట్‌లో దాచుకుంటుందో అలాగే తల్లి కూడా తన బిడ్డను పొత్తిళ్లకు హత్తుకుంటే ఎంతో హాయినిస్తుంది. నేడు కంగారూ సంరక్షణ అవగాహన దినం సందర్భంగా నవజాత శిశువుల సంరక్షణ ప్రాధాన్యతపై ప్రత్యేక కథనం.

కర్నూలు(హాస్పిటల్): తల్లీబిడ్డల మధ్య శిశువు, శిశు సంరక్షకురాలి మధ్య సత్వర, సుదీర్ఘ శారీరక స్పర్శ కల్పించడం, తల్లి, తన బిడ్డను గుండెలకు హత్తుకునే చూడటం కంగారూ మాతృసంరక్షణ(కేఎంసీ)లోని కీలకాంశం. అలా అని కేఎంసీలో కేవలం శిశువుకు శారీరక స్పర్శ ఒక్కటే ఉండదు. కంగారూ పొజిషన్, కంగారూ న్యూట్రిషన్, కంగారూ డిశ్చార్జ్ ఈ మూడూ కలగలిపితేనే కేఎంసీ అవుతుంది.

కంగారూ పొజిషన్
ఈ విధానంలో నవజాత శిశువును ఎలాంటి ఆచ్ఛాదన లేకుండా తల్లి గుండెలకు హత్తుకోవడం జరుగుతుంది. దీనివల్ల తల్లీ బిడ్డలిద్దరి మధ్య గాఢమైన శారీరక స్పర్శ ఏర్పడుతుంది. తల్లీబిడ్డలు ఒకరినొకరు చూసుకునే విధంగా ఇద్దరూ వీలైనంతవరకు నిలబడే భంగిమలో లేదా కూర్చునే భంగిమలో ఉండటం జరుగుతుంది. తక్కువ బరువుతో, నెలలు నిండకుండా పుట్టిన పిల్లలకు తరచుగా ఈ విధానంలో శారీరక స్పర్శ కలిగిస్తారు. ఇది ఒకరకంగా ప్రేమతో కూడిన ఆలింగనం కూడా.

కంగారూ న్యూట్రిషన్
ఈ విధానంలో వీలున్నంత వరకు శిశువుకు తల్లిపాలను మాత్రమే ఇస్తారు. ఈ కేఎంసీలో తల్లి నేరుగా బిడ్డకు స్తన్యం ఇవ్వొచ్చు. ఒకవేళ శిశువు పాలు తాగలేకపోతే తల్లి పాలను ఒక కప్పులో లేదా చెంచాలో పట్టి బిడ్డకు పట్టడం జరుగుతుంది. సంప్రదాయ పద్ధతి(ఉగ్గు గిన్నె)లో కూడా పాలు పట్టవచ్చు. నెలలు నిండకుండా పుట్టిన పిల్లలకు తల్లిపాలతో పాటు తగినన్ని పోషకాలను కూడా తప్పనిసరిగా చేరుస్తారు.

కంగారూ డిశ్చార్జ్
కంగారూ మాతృ సంరక్షణలో శిశువులు శారీరక బలాన్ని, తగినంత వెచ్చదనాన్ని త్వరగానే సముపార్జించుకుని తల్లిపాలు తాగడం ప్రారంభిస్తారు. ఆసుపత్రి నుంచి వచ్చేసిన తర్వాత ఇంట్లోనే తన బిడ్డకు తగిన ఆరోగ్య సంరక్షణ ఇవ్వగలనన్న నమ్మకం తల్లికి కలుగుతుంది. దీనవల్ల ఆసుపత్రి నుంచి ముందుగానే ఇంటికి రావడం, ఇంటిలోనే కంగారూ మాతృసంరక్షణను కొనసాగించేందుకు వీలవుతుంది. ముందుగానే ఆసుపత్రి నుంచి ఇంటికి వచ్చినా, బిడ్డ ఎదుగుదలను పరీక్షించేందుకు, టీకాలను మొదలైన వాటిని వేయించడానికి క్రమం తప్పకుండా ఆసుపత్రికి వెళుతూనే ఉండాలి. శిశువు నాడీ వ్యవస్థ అభివృద్ధి ఎలా ఉందనేది ఎప్పటికప్పుడు మదింపు చేస్తూ ఉండాలి.


కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఎస్ఎన్‌సీయూలో శిశువుల కోసం ఏర్పాటు చేసిన ఇంక్యుబేటర్లు, వార్మర్లు

కేఎంసీ వల్ల తల్లికి కలిగే ప్రయోజనాలు
- పుట్టిన వెంటనే పసిబిడ్డ ఆలనా, పాలనా చూడటంలో తల్లి చురుగ్గా ఉంటుంది.
- తల్లి సాధికారతను, ప్రశాంతతను అనుభవిస్తుంది. దాంతో ఆసుపత్రిలోనూ, ఆసుపత్రి నుంచి ఇంటికి వచ్చాక కూడా బిడ్డ ఆలనా పాలనా చూసుకోగలనన్న నమ్మకం, ఆత్మవిశ్వాసం కలుగుతాయి.
- ప్రసవానంతరం కలిగే నిర్వేదం, మనో వైకల్యాలు గణనీయంగా తగ్గుతాయి.
- హార్మోనులు బాగా వృద్ధి చెందడం ద్వారా బిడ్డకు స్తన్యం బాగా ఇవ్వగలుగుతుంది.
- జననాంతర శిశు సంరక్షణ కూడా చక్కగా చేయగలదు.

కంగారూ స్థితిలో పాపాయి సంరక్షణ
కంగారూ స్థితిలో పాలు పట్టడం సహా అవసరమైన సంరక్షణ అంతా జరుగుతుంది. డైపర్లు మార్చడం, ఇతర శుభ్రత చర్యల కోసం మాత్రమే పాపాయిని కేఎంసీ నుంచి బయటకు తేవడం జరుగుతుంది. బిడ్డకు ప్రతిరోజూ స్నానం చేయించాల్సిన అవసరం లేదు. తల్లి మాత్రం రోజూ స్నానం చేయాలి. ఒక వేళ ఇంట్లో ఆచారాల ప్రకారం బిడ్డకు తప్పనిసరిగా స్నానం చేయించాల్సి వస్తే ఏదైనా గదిలో వెచ్చని నీటితో తొందరగా స్నానం చేయించాలి. స్నానమైన వెంటనే పాపాయిని బాగా తుడవాలి. తర్వాత వెచ్చని బట్టలో చుట్టి పెట్టాలి. వీలైనంత త్వరగా శిశువును కేఎంసీ స్థితిలోకి తీసుకురావాలి. శిశువుకు పాలిచ్చే ముందు తప్పనిసరిగా చేతులు శుభ్రంగా కడుక్కోవాలి. పాపాయికి పాలు పట్టేందుకు ఉపయోగించే కప్పు, చెంచా తదితరాలను సబ్బు, నీళ్లతో బాగా శుభ్రం చేయాలి. దీనివల్ల పాపాయికి ఎలాంటి ఇన్‌ఫెక్షన్లు సోకకుండా, నీళ్ల విరేచనాలు, వాంతులు కాకుండా చూడవచ్చు.

ఎలాంటి శిశువులు అర్హులు
- తక్కువ బరువుతో పుట్టిన, నెలలు నిండకుండానే పుట్టిన శిశువులందరినీ దీనిలో చేర్చాలి.
- ఏ ఒక్క శిశువూ కేఎంసీని చేజార్చకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలి.
- తీవ్రమైన అనారోగ్యంతో ఉన్న శిశువులను ఆ సమస్య పరిష్కారం అయ్యేంత వరకు కేఎంసీకి దూరంగా ఉంచాలి. ఇలాంటి పిల్లలకు వీలైనంత త్వరగా కేఎంసీని ప్రారంభించాలి.

కంగారూ మాతృ సంరక్షణతో శిశువుకు కలిగే ప్రయోజనాలు
- శిశువు శరీర ఉష్ణోగ్రత మరీ తక్కువ గాకుండా నివారించవచ్చు.
- శిశువు ఎక్కుసార్లు, చాలా సేపు తల్లి పాలు తాగుతుంది. దీనివల్ల బిడ్డ ఎదుగుదలకు బాగుంటుంది.
- శిశువు తొందరగా శారీరక సుస్థిరతను సంతరించుకుంటుంది. అంటే శ్వాసక్రియ, హృదయ స్పందన రేటు బాగుంటుంది. శిశువు మంచి రంగు వస్తుంది.
- మెదడు ఎదుగుదల బాగుంటుంది. నాడీ వ్యవస్థ బాగా అభివృద్ధి చెందుతుంది.
- అంటు వ్యాధులు సోకే ప్రమాదం బాగా తగ్గుతుంది.
- తల్లీబిడ్డల మధ్య అనుబంధం పెరుగుతుంది.
- ఒత్తిడి తగ్గుతుంది. భద్రతా భావం మెరుగుపడుతుంది. దీనివల్ల శిశువు అస్తమానం ఏడవటం తగ్గుతుంది.

కంగారూ పద్ధతిపై అవగాహన కల్పిస్తున్నాం



జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవించిన తల్లులకు కంగారూ పద్ధతిపై వైద్యసిబ్బందిచే అవగాహన కల్పిస్తున్నాము. కంగారూ పద్ధతి ఎలా నిర్వహించుకోవాలి, దానివల్ల తల్లికి, బిడ్డకు ప్రయోజనాలు పేర్కొంటున్నాము. బరువు తక్కువతో జన్మించిన బిడ్డకు, నెలలు నిండకుండా జన్మించిన శిశువుకు ఇది అవసరం అవుతుంది. అయితే ఇలాంటి శిశువులో ఏవైనా అనారోగ్య సమస్యలు ఉంటే మాత్రం వారిని ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఎస్ఎన్‌సీయూల్లో చికిత్స అందిస్తున్నాము. ఈ మేరకు జిల్లాలో కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు సౌకర్యాలు ఏర్పాటు చేశాము.
–డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్, డీఎంహెచ్‌వో, కర్నూలు

తల్లీ బిడ్డల మధ్య అనుబంధం ఏర్పడుతుంది



బిడ్డను పొత్తిళ్లకు హత్తుకుని ఉంచడాన్నే కంగారూ మదర్ కేర్ అంటారు. నెలలు నిండకుండా, బరువు తక్కువగా పుట్టిన పిల్లలకు ఇది బోలెడు ప్రయోజనాలు అందిస్తుంది. ఈ పద్ధతిలో బిడ్డను తల్లి తన ఛాతిమీద చర్మానికి హత్తుకుని పడుకోబెట్టుకోవాలి. ఇది తల్లులకే గాకుండా తండ్రి కూడా చేయవచ్చు. ఇందులో తల్లి వెచ్చదనం పాపాయికి తాకుతుంది. దీనివల్ల శిశువుల శరీర జీవక్రియ, శరీర ఉష్ణోగ్రతలు క్రమపద్ధతిలో ఉంటాయి. వారి మెదడు పనితీరు మెరుగ్గా ఉంటుంది. బిడ్డకు ఇన్‌ఫెక్షన్లు సోకకుండా నిరోధిస్తుంది. అలాగే తల్లీబిడ్డల మధ్య అనుబంధం ఏర్పడుతుంది.
– డాక్టర్ ఆర్. మురార్జి, చిన్నపిల్లల వైద్యులు, కర్నూలు

వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై దాడి

- తలపై బండరాయితో మోదిన టీడీపీ వర్గీయులు


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చాకలి విజయుడు

పగిడ్యాల: పడమర ప్రాతకోటలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త చాకలి విజయుడుపై టీడీపీ వర్గీయులు దాడి చేశారు. తలకు తీవ్ర గాయం కావడంతో కర్నూలుకు తరలించారు. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన టీడీపీ వర్గీయుడు గంగి హరిప్రసాద్ గత రెండు రోజులుగా వాట్సాప్ స్టేటస్‌లో నందికొట్కూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ దారా సుధీర్, సచివాలయ మండల కన్వీనర్ రమేష్‌నాయుడును దూషిస్తూ వ్యక్తిగత ప్రతిష్ఠకు భంగం కలిగేలా పోస్టింగ్‌లు పెడుతున్నాడు. అలాంటి పోస్టులు పెట్టవద్దని హరిప్రసాద్ తండ్రి గంగిరమణను మంగళవారం రమేష్‌నాయుడు సూచించాడు. అయితే ఈ విషయంపై వారి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. రమేష్‌నాయుడు అనుచరుడు చాకలి విజయుడు పగిడ్యాలకు వెళ్తుండగా సంత మార్కెట్ వద్ద తెలుగు వెంకటేశ్వర్లు, గంగి హరిప్రసాద్, గంగి రమణ, తెలుగు లక్ష్మన్న, కర్ణ, చిన్నస్వాములు దుర్భాషలాడుతూ రాళ్లతో దాడి చేయడంతో తలకు తీవ్ర గాయమైంది. వెంటనే బాధితుడిని నందికొట్కూరు ఆసుప్రతికి తరలించగా, అక్కడ ప్రాథమిక చికిత్స చేసి కర్నూలుకు తరలించారు. సమాచారం తెలుసుకున్న ముచ్చుమర్రి ఎస్ఐ జయశేఖర్ సీఆర్‌పీ బలగాలతో పర్యవేక్షించి గ్రామంలో పికెటింగ్ ఏర్పాటు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు 8 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నలుగురిపై కేసు నమోదు:
ముచ్చుమర్రి స్టేషన్ పరిధిలోని పడమర ప్రాతకోట గ్రామంలో మంగళవారం ఉదయం తెలుగు బలరాముడు అనే వ్యక్తిని కాళ్లు, చేతులతో తన్ని, కొట్టిన నలుగురి నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జయశేఖర్ తెలిపారు. గ్రామానికి చెందిన రమేష్‌నాయుడు, నరసింహ, స్వాములు, మల్లయ్యలు బలరాముడుపై దాడికి పాల్పడినట్లు బాధితుడు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడన్నారు. ఈ మేరకు నలుగురు నిందితులపై కేసు నమోదు చేశామని ఎస్ఐ పేర్కొన్నారు.

పెద్దాసుపత్రిలో రాగి కడ్డీల చోరీ

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో చిల్లర దొంగలు అధికమయ్యారు. ఇప్పటి వరకు ఆసుపత్రిలోని వార్డుల్లో, వరండాల్లో కుళాయి బిరడాలు విప్పుకెళ్లి గుజిరిలో అమ్మి సొమ్ము చేసుకుని జల్సాలు చేసుకునేవారు. తాజాగా ఎక్కడ రాగి పైపులు కనిపించినా వదలడం లేదు. ఇటీవల రోగుల సౌకర్యార్థం ఆసుపత్రి అధికారులు అవసరమున్న చోట ఏసీలను ఏర్పాటు చేశారు. ముఖ్యంగా ఏఎంసీ, చిన్నపిల్లల విభాగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చి అక్కడ ఏసీలు సమకూర్చారు. అయితే చిన్నపిల్లల విభాగం రెండో అంతస్తులో ఏర్పాటు చేసిన ఏసీలకు ఉన్న రాగి పైపులను దొంగలు కోసుకువెళ్తున్నారు. నాలుగు రోజుల్లో ఇలా రెండోసార్లు జరిగింది. మీటరు పొడవుండే రాగిపైపులతో పాటు ఆక్సిజన్ వెళ్లే పైపులను సైతం తస్కరిస్తున్నారు.

ఈ కారణంగా ఒకవైపు చిన్నపిల్లల విభాగంలోని ఎస్‌ఎన్‌సీయూలో చిన్నపిల్లలకు ఆక్సిజన్ కొరత, ఏసీ సౌకర్యం లేకపోవడం వంటి సమస్యలు కలుగుతున్నాయి. ఆసుపత్రిలో ఇలాంటి చోరీలను అరికట్టేందుకు ఆయా విభాగాల వద్ద సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేసినా ఫలితం లేకపోవడంతో అధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సెక్యూరిటిటీ గార్డుల నిర్లక్ష్యంతోనే విలువైన పరికరాలు పాడై పోవడంతో పాటు చిన్నపిల్లల వైద్యసేవలకు అంతరాయడం ఏర్పడుతోందని మండిపడుతున్నారు.

స్ట్రాంగ్‌రూమ్‌లకు పటిష్ట భద్రత

- నిరంతరం సీసీ కెమెరాల పర్యవేక్షణ
- జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన


జిల్లా కలెక్టర్ సృజన సమక్షంలో ఈవీఎంలు భద్రపరిచిన గదులకు సీల్ వేస్తున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్): రాయలసీమ యూనివర్సిటీలో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన ఈవీఎంలను భద్రపరచే స్ట్రాంగ్ రూమ్‌లకు మూడంచెల పటిష్ట బందోబస్తు ఏర్పాట చేసినట్లు కలెక్టర్ డాక్టర్ జి.సృజన తెలిపారు. అంతేకాక నిరంతరం సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉంటుందని చెప్పారు. మంగళవారం రాయలసీమ యూనివర్సిటీలోని ఇంజినీరింగ్ బ్లాక్, లైఫ్ సైన్సెస్ బ్లాక్‌లలో 8 అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎంలను ఆమె జనరల్ అబ్జర్వర్లు జాఫర్, మీర్ తారీఖ్ అలీ, పంకజ్ కుమార్, రాజకీయ పార్టీల సమక్షంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరచిసీల్ వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..మే 13వ తేదీన జరిగిన పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో వినియోగించిన ఈవీఎంలను అదే రోజు రాత్రి రిసెప్షన్ సెంటర్లకు తరలించి మంగళవారం ఉదయం పటిష్ట బందోబస్తు మధ్య స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరచినట్లు చెప్పారు. కేంద్ర బలగాలతో మూడెంచల భద్రత కల్పించనున్నట్లు ఆమె వివరించారు. కార్యక్రమంలో ఆయా నియోజకవర్గాల ఆర్వోలు నారపురెడ్డి మౌర్య, భార్గవ్‌తేజ, శివ్‌నారాయణ్ శర్మ, ఎం.శేషిరెడ్డి, రామలక్ష్మీ, చిరంజీవి, మురళి, రాము నాయక్ పాల్గొన్నారు.

మహానందిలో వైశాఖ శుద్ధ సప్తమి వేడుకలు


గంగాదేవికి పంచద్రవ్యాలతో అభిషేకం చేస్తున్న దృశ్యం

మహానంది: ప్రతి ఏడాది వైశాఖ శుద్ధ సప్తమి సందర్భంగా మహానందిలోని రుద్రగుండంలో స్వయంగా వెలిసిన గంగాదేవికి చేసే విశేష పూజల్లో భాగంగా మంగళవారం వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, అర్చక, పండిత బృందం విశేష ద్రవ్యాభిషేక పూజలు చేపట్టారు. ముందుగా గంగాదేవి అమ్మవారిని విశేషంగా అలంకరించి మేళతాళాలతో ఆహ్వానిస్తూ రుద్రగుండం కోనేరులోని పంచలింగాల మండపానికి చేర్చారు. అక్కడే అమ్మవానిరి ఆశీనులు చేసి గంధ, చందనాలతో చూర్ణాభిషేకం, హారతులు చేపట్టారు. అనంతరం విశేష పూజలు నిర్వహించారు.

బాలుడికి పాముకాటు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అక్షయ్

మహానంది: బహిర్భూమికి వెళ్లిన నాలుగేళ్ల బాలుడు పాముకాటుకు గురవడంతో పరిస్థితి విషమంగా ఉంది. గాజులపల్లె గ్రామానికి చెందిన శీలం ఓబులేసు, గంగాదేవిలకు ముగ్గురు సంతానం కాగా నాలుగేళ్ల వయసున్న అక్షయ్ చిన్నవాడు. అయితే సోమవారం మధ్యాహ్నం బహిర్భూమికి అని ఇంటి బయలు ప్రదేశంలోకి వెళ్లాడు. అక్కడే ఉన్న ఓ పాము చేతికి కాటేసింది. ఏడుస్తున్న అక్షయ్‌ను ఓదార్చే క్రమంలో నోట్లో నుంచి నురగ రావడంతో చేతికి ఉన్న కాట్లను గమనించిన తల్లిదండ్రులు వెంటనే చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచన మేరకు నంద్యాలకు తరలించారు.

మందుల కోసం వచ్చి చైన్ స్నాచింగ్‌కు యత్నం

వెల్దుర్తి(కృష్ణగిరి): మందుల కోసం మెడికల్‌షాపుకొచ్చిన ఓ యువకుడు దుకాణంలోని మహిళ మెడలోని బంగారు గొలుసు అపహరణకు యత్నించాడు. ఈ ఘటన మంగళవారం రాత్రి వెల్దుర్తిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మద్దికెరకు చెందిన యువకుడు షాహిద్ మంగళవారం రాత్రి 8 గంటల సమయంలో వెల్దుర్తి పోలీస్ స్టేషన్ సమీపంలోని శేఖర్ మెడికల్ స్టోర్‌కు వెళ్లాడు. టాబ్లెట్లు కావాలని అడిగాడు. ఆ సమయంలో దుకాణంలో శేఖర్ భార్య సుధారాణి, కుమార్తె సుమాంజలి ఉన్నారు. యువకుడు అడిగిన మాత్రలు సుధారాణి తీసుకొచ్చి ఇస్తుండగా హఠాత్తుగా ఆమె మెడలోని బంగారు గొలుసును లాక్కొని బైక్‌పై వెళ్లేందుకు యత్నించాడు. గమనించిన దుకాణదారురాలి కుమార్తె పట్టుకునేందుకు ప్రయత్నించడంతో ఆ యువకుడు బైక్‌ను అక్కడే వదిలేసి పరారయ్యాడు. ఈ విషయంలో పోలీసులకు తెలియజేయడంతో వారు గాలించి పాతబస్టాండ్ సమీపంలో ఆ యువకుడిని పట్టుకున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నట్లు ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.

పిడుగుపడి వ్యక్తి మృత్యువాత


మృతిచెందిన గొర్రెల కాపరి పెద్ద అంజనేయులు

ఆత్మకూరు: అమలాపురం గ్రామంలో పిడుగుపాటుకు ఓ గొర్రెల కాపరి మృత్యువాత పడ్డాడు. గ్రామానికి చెందిన పెద్ద ఆంజనేయులు (40) మంగళవారం గొర్రెలు మేపేందుకు వెళ్లాడు. అయితే ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురవడంతో సమీపంలోని చెట్టు కిందుకు వెళ్లాడు. ఆ సమయంలో చెట్టుపై పిడుగు పండటంతో ఆంజనేయులు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు.

బైక్ ఢీకొని యువకుడి మృతి



మృతి చెందిన షేక్ ఆరీఫ్

నందికొట్కూరు: పట్టణంలోని మిడుతూరు రోడ్డులో గోశాల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. టౌన్ సీఐ ప్రకాష్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు .. పట్టణంలోని హాజీ నగర్‌కు చెందిన షేక్ మహమ్మద్ రఫి కుమారుడు షేక్ ఆరీఫ్ (18) బజారు నుంచి రాత్రి ఇంటికి వెళ్తుండగా అదే సమయంలో కొణిదెల గ్రామానికి చెందిన శ్రీనివాసులు మద్యం మత్తులో బైక్‌పై వెళ్తు ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన ఆరీఫ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.